జనవరి 2న ఏకసభ్య కమిషన్ రాక : కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ తో ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ జనవరి 2వ తేదీన ఉదయం 11.00 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్), నిజామాబాద్ నందు ఉపవర్గీకరణ, వివరణాత్మక అధ్యయనం కోసం విచ్చేయుచున్నదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన వారు హాజరై ఏక సభ్య కమిషన్ కు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డు కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు, ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన అన్ని వర్గాల వారు హాజరై ఏకసభ్య కమిషన్ కు తమ తమ వినతులు అందజేయాలని కలెక్టర్ కోరారు. కమిషన్‌కు నిర్ణీత నమూనాలో సమర్పించాల్సిన దరఖాస్తు ఫారములు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయాలలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

మండలపరిషత్ ఆఫీస్‌లో నాగుపాము కలకలం

నవతెలంగాణ-రెంజల్



రెంజల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నాగుపాము కలకలం సృష్టించింది. ఉదయం వేళ గదులను శుభ్రం చేస్తున్న స్వీపర్.. నాగుపామును గుర్తించి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. దానిని బయటకి తీయడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చింది. బాత్రూంలో కప్పను మింగిన పాము.. అక్కడే ఉన్న ఓ రంధ్రంలో ఇరుక్కుపోయింది. బయటకు రాలేక అవస్తలు పడింది. సిబ్బంది కొద్ది సేపు శ్రమించి పామును అక్కడి నుంచి బయటకు తరిమేశారు. దీంతో కార్యాలయ సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

కొర్రీలు పెట్టకుండా వ్యవసాయకూలీలకు కూలీబంధు రూ.12 వేలు ఇవ్వాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తల డిమాండ్
- వామపక్ష రైతులకూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పెద్దివెంకట్‌రాములు

వ్యవసాయ కూలీలకు కొర్రీలు పెట్టకుండా.. ఎన్నికల్లో హామీ ఇచ్చినటువంటి రూ.12 వేల కూలీబంధు అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వామపక్ష రైతుకూలీ, వ్యవసాయ కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12,000 కూలీబంధు ఇస్తామని, రూ.4,000 వృద్ధాప్య పింఛన్ ఇస్తామని, గృహిణులకు గృహలక్ష్మి పథకం కింద రూ.2500 రూపాయలు ఇస్తామని ఇచ్చిన హామీల అమలుకు ఇప్పటి వరకు ప్రయత్నం చేయలేదని విమర్శించారు.

ఈ మధ్యన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఈ డిసెంబర్ 28న రూ.6000 వేస్తామని మిగతా 6000 ఆరు నెలల తర్వాత వేస్తామని ప్రకటించినట్టు గుర్తు చేశారు. ప్రకటనను స్వాగతిస్తున్నామని, కానీ జాబు కార్డులు ఉండి వంద రోజులు పని చేసిన వాళ్లకే ఇస్తామని లిటిగేషన్ పెట్టడం సరికాదని, శాస్త్రీయత కాదని అన్నారు. పూర్తిగా వ్యవసాయం లేకుండా కూలి మీదనే ఆధారపడి ఉన్న గ్రామీణ వ్యవసాయ కూలీలకు 60 శాతం పైగా జాబ్ కార్డులు ఇవ్వలేదని, బోగస్ దారులకే ఎక్కువ ఉన్నాయని గుర్తు చేశారు. 10 ఎకరాలు ఉన్న వాళ్లకు సైతం జాబ్ కార్డులు ఉన్నాయని తెలిపారు.

'ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పద్ధతి వల్ల ఫోటోలు ప్రతిరోజు రెండుసార్లు అప్లోడ్ చేయాలి. పనిచేస్తున్న క్షేత్రం నుంచి అక్కడ సిగ్నల్ లేకపోతే అప్లోడ్ కావు ఆ రోజు వాళ్ళు పనిచేయని కింద లెక్క అవుతుంది. కాబట్టి వంద రోజులు పూర్తి చేసుకునే అవకాశాలు లేదు. ఈ నిబంధనని ఎత్తివేసి జాబ్ కార్డులు లేకుండా వ్యవసాయ కూలీ పనులు చేస్తున్న వాళ్ళు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారిని గ్రామసభలు పెట్టి గుర్తించి వారికి భేషరతుగా 12,000 ఇవ్వాలని' సమావేశం డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

అంతేకాదు ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోని ఒంటరి మహిళలు కూడా ఉన్నారని, వారికి ఈ ఇందులోనే అవకాశం కల్పించి సంవత్సరానికి 12000 ఇవ్వాలని సూచించారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు 4000, గృహలక్ష్మి భృతి 2500 తప్పకుండా చెల్లించాలని ప్రభుత్వానికి రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా సూచిస్తున్నామన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అయినా ప్రభుత్వం స్పందించకపోతే సమరశీల పోరాటాల కైనా అన్ని సంఘాలను కలుపుకొని పోరాటానికి సిద్ధమవుతావని హెచ్చరించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వేల్పూర్ భూమన్న, ఏఐపి కేఎంఎస్ జిల్లా కార్యదర్శి సిహెచ్ సాయ గౌడ్, బికేఎంయు జిల్లా కార్యదర్శి బొంబాయి గంగన్న, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్, సభ్యులు నల్వాల నరసయ్య, రైతు సంఘం నాయకులు ఎర్ర సాయిలు, జి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన హక్కుల గొంతుక

- మానవహక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు కన్నుమూత
- నివాళి అర్పించిన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ
- ఆయన భౌతికకాయం ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేస్తున్నట్టు కుటుంబీకుల వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్



గొర్రెపాటి మాధవరావు(ఫైల్)

హక్కుల గొంతుక మూగబోయింది. మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు (67) కన్నుమూశారు. శుక్రవారం మధ్యాహ్నం గుండెలో సమస్య తలెత్తడంతో ఆయన బంధువులు నిజామాబాద్ నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్యం అందించినా శరీరం సహకరించకపోడంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు మానస, ఆదిత్య మధుమిత్, భార్య మీనా సహాని ఉన్నారు. ఆయన మరణ వార్త విన్న ప్రజా సంఘాల నేతలు పలువురు గొర్రెపాటి పార్థీవశరీరానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రగాఢ సానుభూతి తెలిపి భౌతికకాయానికి నివాళి అర్పించారు. మాధవరావు భౌతికకాయాన్ని విద్యార్థుల పరిశోధనల కోసం నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నేత్రాలను లయన్స్ క్లబ్‌కు ఇవ్వనున్నారు.

గొర్రెపాటి మాదవరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా గురునాథ్ పాలెం గ్రామంలో 4 మార్చి, 1957 లో జన్మించారు. ఆయనకు మూడు నెలల వయసు ఉన్నప్పుడే ఆయన తల్లిదండ్రులు నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం అడకాస్ పల్లి వచ్చి స్థిరపడ్డారు. ఎత్తొండ గ్రామంలో 7 వ తరగతి వరకు చదివిన అనంతరం కోటగిరి, బీర్కూర్ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలలో చదివి పదవ తరగతి ఉత్తీర్ణులైన పిదప బాన్సువాడ లో ఇంటర్ పూర్తి చేశారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ లో డిగ్రీ చదివి ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో న్యాయశాస్త్ర పట్టభద్రులైన అనంతరం 21 జనవరి, 1982 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని నిజామాబాద్ జిల్లాలో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. విద్యార్థి దశలోనే విప్లరాజకీయపట్ల ఆకర్షితుడై ఎమ్ ఎల్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రగతిశీల విద్యార్థి సంఘం నిర్మాణంలో తమవంతు కృషి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా విధులు నిర్వహించారు. కన్నబిరాన్, బాలగోపాల్ ల సాంగత్యంలో మానవ హక్కుల వేదిక స్థాపకుడిలలో ఒకరయ్యారు.

మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఐక్యరాజ్యసమితి విశ్వమానవ హక్కుల పత్రాన్ని తెలుగులోకి అనువదించారు. కార్మిక చట్టాలు, గతితార్కిక భౌతికవాదం, చైనా విప్లవం పుస్తకాలు రచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలలో పోలీసులకు పౌరహక్కులు, మానవహక్కుల గూర్చి ఉద్బోధించారు. నిజామాబాద్ నగరంలో జరిగిన రెండు బూటకపు పోలీస్ ఎంకౌంటర్ లలో మృతి చెందిన యువకుల బంధువుల తరపున కోర్టులో నష్టపరిహార దావాలు వేసి గెలిచారు. చివరి శ్వాసవరకు మానవ హక్కుల కోసం తపించారు.

ప్రజా హక్కులకు తీరనిలోటు : సీపీఐ(ఎం) సంతాపం



జోహార్లు అర్పిస్తున్న సీపీఐ(ఎ) నాయకులు

గొర్రెపాటి మాధవరావు మృతికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావంతో పనిచేసిన మాధవరావు అనేకమంది అభాగ్యులకు న్యాయవాదిగా బాసటగా నిలిచి వారి పక్షాన పోరాటం చేసినట్టు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, పల్లపు వెంకటేష్, నాయకులు రామ్మోహన్‌రావు, సిర్ప లింగం, ఈవీఎల్ నారాయణ, అనసూయమ్మ, కటారి రాములు తదితరులు నివాళి అర్పించారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్



ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. యూనియన్ కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించి కలెక్టర్ ఏవో కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు బాలనర్సు మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. 6 నెలలు నుండి వేతనాలు రాక చాలీచాలనీ వేతనాలతో పని చేస్తూ ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. జీవో నం.51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి కేటగిరి వారీగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత బకాయిలు చెల్లిస్తూ కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు చనిపోయిన వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తూ రూ. 10 లక్షల బీమా, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని లేనిచో జనవరి నెలలో నిరవదిక సమ్మెకు వెళ్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజన్న, జిల్లా కార్యదర్శి సాయిలు, రూప్ సింగ్, బాలనర్సు మల్లేశ్, కవిత, లక్ష్మన్న, రాజు, మోహన్, అరవింద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో కీలక సమాచారం

- చెరువు వద్ద సీన్ రీ కన్‌స్ట్రక్షన్.. నీటి శాంపిళ్లు సేకరణ

నవతెలంగాణ-కామారెడ్డి



ముగ్గురు మృతికి సంబంధించిన కీలక విషయాలు ఫోన్‌లో ఉన్నట్టు సమాచారం. ఎస్ఐ వద్దమూడు ఫోన్‌లు ఉండగా.. అందులో ఒక్క ఫోన్ మాత్రమే ఓపెన్ అయింది. మిగతా రెండు యాపిల్ ఫోన్‌లు ఓపెన్ కావడం లేదు. వాటి యాక్సెస్ కోసం ప్రయత్నస్తున్నారు. వాటిని ఓపెన్ చేయగలిగితే కీలక సమాచారం లభించి కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. కాగా లేడీ కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ ఫోన్‌లలో వచ్చిన సమాచారాన్ని మాత్రం పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. కాగా శనివారం చెరువు వద్ద సీన్ రీ కన్‌స్ట్రక్షన్ నిర్వహించి చెరువు నీళ్ల శాంపిళ్లను సేకరించారు. ఎస్సై సాయి కుమార్ చెరువు వద్ద నిలిపిన కారు ప్రదేశాన్ని, చెరువు గట్టుపైన ఉంచిన చెప్పులు, సెల్ ఫోన్ల ప్రదేశాన్ని పోలీసులు పరిశీలించారు. కాగా ఎస్సై భార్య లక్ష్మి కొన్ని విషయాలను వెల్లడిస్తేనే అసలు విషయం తెలిసే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మృతులు లేడీ కానిస్టేబుల్ శృతి, ఎస్ఐ సాయికుమార్ విషయంలోనే గత నెల రోజుల క్రితమే తన భర్తతో తో లక్ష్మి గొడవపడి ఇంటి నుండి తల్లి గారి ఇటికి వెళ్లినట్లు సమాచారం. సాయికుమార్ వద్ద మూడు ఫోన్లు ఉండగా అందులో ఒక ఫోన్ మాత్రమే ఫోన్ లాక్ ఓపెన్ అయిందని, మిగతా రెండు ఫోన్లు ఆపిల్ ఫోన్లు కావడంతో అవి పాస్వర్డ్ లేకపోవడంతో అవి ఓపెన్ కావడం లేదు దీంతో ఆ ఫోన్‌లలోనే అసలు విషయా లు ఉండవచ్చునని అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. కాగా మృతు రాలు శృతి ఒంటిపై గాయాలు ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతంగా, పక్కగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- గ్రామాలభివృద్ధిపై అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులు వేగవంతంగా, నాణ్యతతో, పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పారిశుధ్యం, తాగు నీరు, ఇంటి పన్ను వసూళ్లు, సి.సి. చార్జీలు, ట్రాక్టర్ నెలవారీ వాయిదాల చెల్లింపులు, కంపోస్టు ఎరువుల తయారు, భవన నిర్మాణాల అనుమతులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, వనమహోత్సవం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ, మహిళా శక్తి, అంశాలపై ఎంపిడిఒ లు, ఎంపీఒ లు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నదని, జనవరి 3 లోగా సర్వే పూర్తిచేయాలని అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సర్వే తీరును పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో 2,38,682 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటివరకు 1,39,194 సర్వే జరిగిందని, 62 శాతం మేర సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలని తెలిపారు. మురికి కాల్వల్లో చెత్తతో నీరు రోడ్లపైకి రాకుండా శుభ్ర పరచాలని తెలిపారు. దోమల వ్యాప్తి నివారణకై పిచికారి చేయాలనీ అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. గత సంవత్సరంలోని అనుభవాలను దృష్టిలో ఉంచుకొని తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, ఏమైనా లీకేజి ఉంటే ముందుగా రిపేర్ చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటిపన్ను వసూళ్లు చేయాలని, వచ్చే జనవరి లోగా 100 శాతం పన్నులు వసూళ్లు చేయాలని తెలిపారు. సి.సి.చార్జీలు, ట్రాక్టర్ నెలవారీ బ్యాంకు కిస్తీలు చెల్లించాలని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ ద్వారా కంపోస్టు ఎరువును తయారు చేయాలని, అట్టి ఎరువును అవసరం మేరకు వినియోగించుకొని , మిగతాది విక్రయించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు, లే అవుట్ అనుమతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇవ్వాలని, 45 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు.

వనమహోత్సవం కార్యక్రమం కింద బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తిచేసి, విత్తనాలు నాటాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కింద జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికీ పనులు కల్పించాలని, లేబర్ మొబైలైజేషన్ చేయాలని అన్నారు. వంద రోజుల పనిదినాలు కల్పించాలని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమం కింద బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి కింద ఋణాలు మంజూరు చేయడం, తీసుకున్న రుణాలను వసూళ్లు చేయాలని తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనం పరిశీలించి మొక్కల ఎదుగుదలకు వాటరింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ సీఈవో చందర్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మిషన్ భగీరథ, గృహ నిర్మాణం, ఎంపిడిఒ లు, ఎంపీఒ లు, గ్రామీణాభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పసుపు తీసుకొస్తే అధికధర

- నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలు ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



హమాలీలకు లైసెన్స్‌లు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పసుపును ఎండబెట్టి తీసుకొస్తే క్వింటాకు రూ. 10.000కు తగ్గకుండా ధర వస్తదని ఏఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కిసాన్ మీటింగ్ హాల్‌లో ఏఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి పసుపు కొనుగోళ్లను శనివారం ప్రారంభించారు. అనంతరం వ్యాపార వర్గాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుకు రైతులు ఎండిన పసుపు తీసుకువస్తే 10,000 వేలాకు తగ్గకుండా ఇస్తాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ అపర్ణ, ఏఎంసి డైరెక్టర్ మల్లేష్, మార్కెట్ కమిటీ సభ్యులు లాబన్, శంకర్ దాస్, మధు సుదన్, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు కొత్త లైసెన్సులు జారీ

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేసే లైసెన్స్ లేని హమాలీలకు కొత్త లైసెన్సులను ఏఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి జారీ చేశారు. అనంతరం సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సాయంకాలం 8 గంటల వరకు ప్రతి ఒక్క హమాలీ తమ బాధ్యతగా తీసుకొని పనిచెయ్యాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ మల్లేష్, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ అపర్ణ, మార్కెట్ కమిటీ సభ్యులు లాబన్, శంకర్ దాస్, మధుసుదన్, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కమల్ కిషోర్, ఏఐటియుసి కార్యదర్శి ఓమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్ప గంగారెడ్డి

మా టీచర్లు మాకు కావాలి

- కస్తూర్బాలో విద్యార్థుల నిరసన




ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

నవతెలంగాణ-బిచ్కుంద

మాకు ఇన్ని రోజులు బోధించిన టీచర్లే మాకు కావాలంటు బిచ్కుంద మండలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులు పాఠశాల ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. తమ చదువులు సరిగా సాగటం లేదని తాత్కాలికంగా ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించారన, వందల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు న్యాయం జరగడం లేదని తమ చదువులు సరిగా సాగటం లేదని గతంలో తమకు బోధించిన ఉపాధ్యాయులే తమకు కావాలని బీష్మించి కూర్చున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అక్కడికి చేరుకొని విద్యార్థులకు సముదాయించి లోపలికి పంపించారు. అనంతరం మండల విద్యా అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అధికారినితోపాటు ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో సమస్యలు ఏర్పడ్డాయని ఈ విషయం జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం

- పోతంగల్-మేడిపల్లి రోడ్డు దుస్థితిపై నవతెలంగాణలో వరుస కథనాలు



నవతెలంగాణలో వచ్చిన కథనాలు



రోడ్డు వేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

మండలంలో ని బాన్సువాడ- కామారెడ్డి ప్రధాన రోడ్డు పై పెద్ద పోతంగల్ నుంచి మేడిపల్లి తండా వరకు గత 19 నెల క్రితం రోడ్డు పనులు ప్రారంభించి వదిలివేశారు. దీంతో దుమ్ము లేస్తుండటంతో పాటు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్టు గత ఆరు నెలల కాలంగా నవతెలంగాణ వరుస కథనాలు ప్రచురించడంతో స్పందించిన అధికార పార్టీ నాయకులు, అధికారులు శనివారం నుంచి తారు రోడ్డు పనులు ప్రారంభించారు. తారు రోడ్డు పనులు ప్రారంభించడంతో మండల ప్రజలు ఇప్పటికైనా రోడ్డు పనుల ప్రారంభించారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దేవాదాయ భూముల సర్వే



భూములను పరిశీలిస్తున్న కార్పొరేటర్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మానిక్‌బండార్ గ్రామ శివారులో వెలసిన వెంచర్‌లో దేవాదాయ భూములు కబ్జాకు గురైనట్టు స్థానిక కార్పొరేటర్ రాయ్‌సింగ్ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మండల సర్వేయర్ కిషన్ నాయక్, అర్‌ఐ షఫీ వెంచర్‌లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖకు సంబంధించిన 474, 499, 480, 548, 503 సర్వే నెంబర్లలో సర్వే నిర్వహించారు. మరి కొద్ది రోజుల్లో హద్దులను సైతం గుర్తించి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాయ్ సింగ్, నీటి సంఘం మాజీ చైర్మన్ ప్రభు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన చిన్నారులతో పాటు కూర్చొని భోజనం చేశారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

సెల్ ఫోన్ అందజేత



నవతెలంగాణ మోర్తాడ్

మండల కేంద్రానికి చెందిన కొత్తూరు జగదీష్ ఫోన్‌ను పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుడి ఫోన్‌ను కనుక్కొని శనివారం అందజేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు.

హమాలీ సమస్య పరిష్కారానికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గత కొన్ని సంవత్సరాలుగా హమాలీలకు లైసెన్స్ లేకపోవడంతో ఈ విషయాన్ని ఏఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఆ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అతి త్వరలోనే మా సమస్యను పరిష్కరించి లైసెన్స్ అందజేసినందుకు హమాలీ సంఘం అధ్యక్షులు పర్శిరాం శనివారం ధన్యవాదాలు తెలిపారు.

శ్రీ విద్యా సాయి హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్



సైన్స్, గణిత ప్రదర్శనల గురించి వివరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ విద్య సాయి హైస్కూల్‌లో శనివారం సైన్స్‌ఫెయిర్ (స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన చాలా రకాల సైన్స్, గణిత ప్రదర్శనలు విద్యార్థులను తల్లితండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎస్ఐ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఫలితాలు పొందాలంటే ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలన్నారు. విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు. స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ పేరుతో సైన్స్‌ఫేయిర్ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థుల కోసం ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రమీల, ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, లీడ్ కోఆర్డినేటర్ జాన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిసిటీయు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



బిసిటీయు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిసి ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తన ఛాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. బిసిటీయు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ వాయిదా వేసిన సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరగా త్వరలో ఏర్పాటు చేద్దామని తెలిపారు. అనంతరం బిసిటీయు ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన నిర్వహించే సావిత్రిబాయి పూలే పురస్కారాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు ఎ.మోహన్, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, బిసిటీయు మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి నర్సయ్య, గౌరవ సలహాదారులు రమణ స్వామి, కొట్టూరు రమేష్, సత్యనారాయణ, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం రోడ్డుపై వెళ్లే వాహనాలను ఎస్సై ఈ సాయన్న ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఆయన వాహనదారులను హెచ్చరించారు. శనివారం సాతాపూర్ సంత కావడంతో వాహనదారులు ఎక్కువ సంఖ్యలో రావడం వల్ల వారిని తనిఖీ చేసి వారికి జరిమానాలు విధించినట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ఇంటర్ విద్య బోధన చేపట్టాలి

- **ప్రతిష్టాత్మకంగా 90 రోజుల ప్రణాళిక**
- **ఇంటర్ విద్య ప్రత్యేక అధికారి ఒడ్డెన్న**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ విద్యలో ప్రతిష్టవంతమైన ప్రణాళికతో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు వెళ్లేందుకు ఇంటర్ బోర్డు 90 రోజుల ప్రణాళికను తీసుకొచ్చిందని ఇంటర్ విద్య ప్రత్యేక అధికారి ఒడ్డెన్న అన్నారు. నిజామాబాద్ జిల్లాలో శనివారం పలు కళాశాలలను తనిఖీ చేసి ఆయన సమీక్షించారు. ఉదయం నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, మధ్యాహ్నం డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒడ్డెన్న తనిఖీ చేసి సమీక్షించారు. నిజామాబాద్ ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్‌తోపాటు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, చంద్ర విట్టల్ ఆయా కళాశాలల అధ్యాపకులు ఈ సమీక్ష సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడ్డెన్న మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు తమ వ్యక్తిగత ఫలితాలను మాత్రమే ఇప్పటివరకు చూసుకుంటున్నారని, దీనివల్ల గ్రూపు ఉత్తీర్ణత శాతం, కళాశాల ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని అన్నారు. ఇక ముందు తమ గ్రూపులకు సంబంధించిన ఇతర సబ్జెక్టుల అధ్యాపకులతో విద్య బోధనలో సమన్వయం చేసుకుంటూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఆయా గ్రూపులలో నిర్దేశించిన మేరకు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గితే ఇంటర్ బోర్డు అధ్యాపకులపై చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అధ్యాపకుల బోధన తీరుతో పాటు, కళాశాలకు హాజరవుతున్న విద్యార్థులకు ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల మార్కుల వివరాల నమోదు, వచ్చే మార్చి నెలలో నిర్వహించే వార్షిక పరీక్షలలో సాధించాల్సిన వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఇకపై అధ్యాపకులు సమన్వయంతో ముందుకు వెళ్తే ఇంటర్ బోర్డు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు. ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య పర్యవేక్షణలో ప్రత్యేక అధికారులను నియమించి చదువులో వెనుకబడిన, కళాశాలకు రెగ్యులర్‌గా రాని విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు వారిని అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులుగా తయారు చేసేందుకు 90 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారని ఒడ్డెన్న అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుల పనితీరును ఆయన సమీక్షించి అంచనా వేశారు. కళాశాలకు రాని విద్యార్థులను కచ్చితంగా రప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు, సలహాలు చేశారు. పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయడంతో పాటు వారి భవిష్యత్తు అధ్యాపకుల చేతిలో ఉందని గమనించాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలకు వస్తున్న పేద, మధ్య తరగతి, వెనకబడిన తరగతుల కులాల, మైనారిటీ వర్గాల విద్యార్థులను జాగరుకతతో గమనిస్తూ, వారి స్థితిగతులను, పరిస్థితులను అంచనా వేస్తూ సబ్జెక్టులను బోధించేందుకు శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం ప్రతి అధ్యాపకుడు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయంపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు ఖచ్చితంగా వ్యవహరించాలన్నారు.

జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ మాట్లాడుతూ ఇదివరకే 90 రోజుల ప్రణాళికపై అన్ని కళాశాల అధ్యాపకులతో ప్రిన్సిపాల్‌లతో సమావేశాలు నిర్వహించామని, అయినప్పటికీ పరిస్థితులలో మార్పులు రాకపోతే ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తానని హెచ్చరించారు. వచ్చే ప్రయోగ పరీక్షలను, వార్షిక పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధ్యాపకులు విద్య బోధనపై శ్రద్ధ వహించాలని అన్నారు. వచ్చే ప్రీ ఫైనల్ పరీక్షల నాటికి ప్రతి విద్యార్థికి తాము ఉత్తీర్ణులవుతామన్న భరోసాను కల్పించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటర్ విద్య ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

మానవ సేవకు కేరాఫ్.. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ

- **ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కొదండరాం**

నవతెలంగాణ-కంఠేశ్వర్

మానవత సేవకు కేరాఫ్ ఇందూరు యువత అని, స్వచ్ఛంద సేవా సంస్థ అనాథలకు అండగా నిలుస్తూ విధి వంచితులకు కొత్త రూపు తీసుకురావడం మామూలు విషయం కాదని 13 సంవత్సరాలుగా నిర్విరామంగా సేవ అందరికీ ఆదర్శమని ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. శనివారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవ వేడుకలు నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు డా.మద్దుకూరి సాయిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదండరాం పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథలను చేరదీయటం నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అనాథ శవాలకు అంత్యక్రియలు చేయడం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఎవరూ చేయలేని సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని కాకుండా గొప్ప సంకల్పంతో మనశ్శాంతి కోవెల ఆశ్రమ ఏర్పాటుకు స్థల సేకరణ చేయడం గొప్ప విషయమని కోనియాడారు. తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత అధ్యక్షుడు చిట్టిమిల హరిప్రసాద్, రజనీష్, దారం గంగాధర్, రత్నాకర్, సుమీల, సూజాత పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గం, కార్యవర్గ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కొదండరాం

ఆలయ నిర్మాణానికి చేయూత



విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాస్ దంపతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన తొగిటి శ్రీనివాస్ విజయలక్ష్మి దంపతులు ఆర్థిక చేయూత అందించారు. ఈ మేరకు శనివారం రూ.25వేల విరాళాన్ని తొగిటి శ్రీనివాస్ విజయలక్ష్మి దంపతులు తమ కుమారుడు రాజా నరేంద్ర చేతుల మీదుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆర్థిక చేయూతను అందించిన తొగిటి శ్రీనివాస్ విజయలక్ష్మి దంపతులకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు అయ్యప్ప ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, జితేందర్, మణికంఠ, రవి, రోహిత్, బావన్, మాలధారణ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

- **నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్ చారి**



పురస్కారాన్ని అందుకుంటున్న మహిపాల్ చారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విశ్వకర్మ జాతికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్ చారి అన్నారు. అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ స్థలం బాబు జగ్జీవన్ రామ్ భవన్ హైదరాబాద్‌లో విశ్వకర్మ జాతికి చేసిన కృషికి గానూ అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు చేడిలాల్ శర్మ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథంచారి చేతుల మీదుగా విశ్వకర్మ మహాసభ జాతీయ పురస్కారాన్ని నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మహిపాల్ చారి అందుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్ చారి మాట్లాడుతూ.. పురస్కారంతో నాపైన మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. విశ్వకర్మ జాతికి అహర్నిశలు కష్టపడి వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కౌలే జగన్నాథం చారి అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ షైలేష్ కుమార్, సిద్ధప్ప, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక సమావేశం వాయిదా

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్ర పరిధిలోని సరయూ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బోధన్ చక్కెర కర్మాగారంపై నిర్వహించనున్న సమావేశం వాయిదా వేసినట్టు ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వర్ తెలిపారు. రైతులతో పాటు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే, కలెక్టర్ హాజరుకావాల్సి ఉండగా.. భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల, అలాగే ఏడు రోజుల పాటు నిర్వహించనున్న సంతాప దినాల్లో కార్యక్రమంలో భాగంగా సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. సమావేశం ఎప్పుడు నిర్వహిస్తామనేది మళ్లీ రైతులకు తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

జనవరి 1 నుంచి సివిల్ సప్లై హమాలీల సమ్మె

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జనవరి 1 నుండి సివిల్ సప్లై హమాలీల సమ్మె నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సివిల్ సప్లై హమాలీల సమ్మె నోటీసును ఏఓ ప్రశాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీలు, స్వీపర్ల గత వేతన ఒప్పందం 31-12-2023 తో ముగిసిందని నూతన ఒప్పందం 1-01-2024 నుండి అమల్లోకి రావాల్సి ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం, సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ నిర్లక్ష్యం వల్ల అమలు కాలేదని, ఏఐటియుసి యూనియన్ పోరాట ఫలితంగా అక్టోబర్ 4న సివిల్ సప్లైస్ రాష్ట్ర కమిషనర్ చౌహాన్ సమక్షంలో చర్చలు జరిపి, ఒప్పందం కుదిరి 3 నెలలవుతున్న నేటికీ జీవో ఇచ్చే పెంచిన రేట్లు అమలు చేయకపోవడంతో జనవరి 1 నుండి సమ్మెకు వెళ్లాలని రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా, జిల్లాలో 8 మండల పాయింట్లు పరిధిలో కార్మికులందరూ సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. కలెక్టర్ చర్యలు తీసుకొని రాష్ట్ర కమిషనర్‌తో చర్చించి జీవోను ఇప్పించడంతోపాటు బకాయి వేతనాలను 2024 జనవరి ఒకటో తేదీ నుండి ఇప్పించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.దేవేందర్, కోశాధికారి రాజన్న, నాయకులు నాగనాథ్, బాబర్, యూసుఫ్, మౌలానా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-రెంజల్

స్వర్గీయ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని ఐకెపి సిబ్బంది కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతి చెందిన నేపథ్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం చిన్నయ్య, సీసీలు భాస్కర్, కృష్ణ, శ్యామల, శివకుమార్, సునీత, కంప్యూటర్ ఆపరేటర్ తస్లీమా, అటెండర్ మమత తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

రేపు గాయనీగాయకుల ఎంపిక

- **ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కళాకారులకు విజ్ఞప్తి**

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రముఖ ప్రజాకవి, గాయకులు వరంగల్ శ్రీనివాస్ రచించిన 'నూరేండ్ల నా ఊరు' గేయకావ్యం ఓయమ్మ నా పల్లెసీమ కోసం గాయనీ గాయకుల ఎంపిక కార్యక్రమం ఈనెల 30 సోమవారం ఉదయం 10 గంటల నుంచి కొత్త అంబేద్కర్ భవన్ ఖలీల్వాడిలో నిర్వహిస్తున్నట్లు నూరేండ్ల నాఊరు కళానేతలు అష్ట గంగాధర్ తెలిపారు. శనివారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నిజామాబాద్ కేంద్రంలో అట్టహాసంగా జరగనున్న ఈ కార్యక్రమానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఆసక్తి ఉన్న గాయనీ గాయకులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని మీ ప్రతిభతో ఈ గేయ కావ్యంలో పాడే అవకాశాన్ని పొందాలని సూచించారు. 243 చరణాలు కలిగిన ఈ గేయకావ్యంలో 243 మంది ప్రతిభావంతులైన గాయనీ గాయకులచే పాడించబడునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేర్ డిగ్రీ కళాశాల అధినేత నరాల సుధాకర్, నూరేండ్ల నాఊరు కళానేతలు అష్ట గంగాధర్, రెలారే గంగా, రాంపూర్ సాయి, సాయి లవోల, లక్క క్రాంతి, సవిత, దివ్య, మహేందర్, రమేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళానేతలు

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులు విలీనం

నవతెలంగాణ-గాంధారి

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఒకే రాష్ట్రం ఒకే గ్రామీణ బ్యాంకు నినాదం ప్రకారం.. భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం మార్గదర్శకాలను అనుసరించి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేస్తున్నారు. ఈ విలీనం ప్రక్రియ డిసెంబర్ 28 నుంచి జనవరి1, 2025న జరుగనుంది. కావున తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అన్ని రకాల సేవలు బ్యాంకు, యూపీఐ, ఎటీఎం, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, చెక్ క్లియరింగ్, డిసెంబర్ 28 నుంచి 31 వరకు 4 రోజులు పూర్తిగా నిలిపివేయబడతాయి. కావున తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులందరూ గమనించాలని బ్రాంచ్ మేనేజర్ తెలిపారు.

2వ రోజుకు ఆమరణ నిరాహార దీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

పేద మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ఈ-బీసీ ప్రజలందరికి విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకై ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శనివారం రెండో రోజుకు చేరింది. కామారెడ్డి జిల్లా నాయకులు లక్ష్మణ్ మహారాజ్, రాజు మాట్లాడుతూ దీక్షకు పెద్ద ఎత్తున మహిళలు, విద్యార్థి నాయకులు, మద్దతు తెలపినట్టు తెలిపారు. ప్రజలందరికీ న్యాయమైన ఉచిత, విద్య, వైద్యం, భూమి, ఇల్లు సాధించేంతవరకు ఈ ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ కో కన్వీనర్ అరవింద్ జిల్లా నాయకులు, రాజు,కవిన్, మీడియా ఇంచార్జి రాజు, రాజశేఖర్, సాయి, మురళి,మహేష్, పర్శరాములు, ప్రభాకర్, శివరామకృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణానికే మొగ్గు

- గిరాకీ కోసం చూస్తున్న ఆటోవాలాలు



నవతెలంగాణ-మద్నూర్

ఆర్టీసీ బస్సులో ప్రయాణానికే ప్రయాణికులు ఆసక్తి చూపిస్తుండటంతో ప్యాసింజర్ ఆటోలు గిరాకీ లేక వెలవెలబోతున్నాయి. మద్నూర్ బస్టాండ్‌లో ఆటోలో నిలిచి ఉంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఎక్కువ మంది తమ ప్రయాణాలకు బస్సులనే వినియోగించుకుంటున్నారు. పురుషులు సైతం కుటుంబ సమేతంగా బస్సులనే ఆశ్రయిస్తుండటంతో ఆటోవాలాలాకు గిరాకీ ఉండటం లేదు. ప్రభుత్వం ఆటోవాలాలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

జాగ్ భోగ్ బంఢార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నేరల్ తండాలో గిరిజనులు నిర్వహిస్తున్న జాగ్ భగ్ బండార్ పండగలో శనివారం సాయంత్రం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని గిరిజనులతో కలిసి డోలు వాయించారు. ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం లో పాల్గొని గిరిజనులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్, వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తూర్పు రాజులు, గాంధారి పట్టణ అధ్యక్షుడు సంఘని బాబా, ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సర్దార్ నాయక్, నాయకులు సర్దార్ సింగ్, కామిల్లి బాలరాజ్, లైన్ రమేష్, గిరిజన నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనవరి 1న ఏఐసిటియు రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ-కామారెడ్డి

మహబూబాద్ జిల్లా కేసముద్రం మండలంలో జనవరి 1న ఏఐసిటియు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు జబ్బర్ నాయక్ తెలిపారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రోజు రోజుకు కార్మిక కర్షక చట్టాలను రద్దు చేయాలని ఆలోచనతో ముందుకెళుతున్నాయని, వాటిని తిప్పి కొట్టేందుకు ఈ మహాసభలు దోహదపడతాయన్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి సంఘటిత, అసంఘటిత రంగల కార్మికులు అందరూ పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజు, గంగరాజు, రమేష్, గంగాధర్, కొమరన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని లక్ష్మీ దేవునిపల్లి, గుర్జకుంట, తిప్పాపూర్, తలమడ్ల గ్రామాలలో నేడు ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సంకీర్త్ తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలో ఉన్న 132 కెవి సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

కామారెడ్డి పట్టణంలో తీరనున్న కరెంటు కష్టాలు

- 33/11 కేవీ సబ్ స్టేషన్ ను మంజూరు
- ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలో నెలకొన్న కష్టాలను తీర్చేందుకు కామారెడ్డికి 33/11 కేవీ సబ్ స్టేషన్ ను మంజూరు చేయించినట్టు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలో ఉన్న సబ్ స్టేషన్ లపై లోడ్ ఎక్కువ పడటం, చుట్టుపక్కల గ్రామాల్లో ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు కామారెడ్డి సబ్ స్టేషన్ నుండి కరెంటు ఇవ్వడం ద్వారా కామారెడ్డి పట్టణానికి కరెంట్ సమస్యలు ఉత్పన్నము అవుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు నాదృష్టికి తీసుకువచ్చారన్నారు.

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తో సిఎండి ఆఫ్ ఎన్ పి డి సి ఎల్ వరంగల్ కర్నాటి వరుణ్ రెడ్డి తో



మాట్లాడి కామారెడ్డి పట్టణానికి ప్రస్తుత మున్న సబ్ స్టేషన్లు కాకుండా నూతనంగా 33.11 కె.వి సబ్ స్టేషన్ కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో మంజూరు చేయించినట్టు తెలిపారు. దీనివలన కామారెడ్డి పట్టణానికి రాబోయే 25 సంవత్సరాల వరకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ఈ సబ్‌స్టేషన్ ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ 33/11 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. రెండు మూడు నెలల లోపు సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-లింగంపేట్

యాసంగి పంటలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. శనివారం లింగంపేట మండలంలోని నల్లమడుగు శెట్టిపల్లి సంగారెడ్డి లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లో నిల్వ ఉంచిన ఎరువులను ఆయన పరిశీలించారు. అవసరమైన రైతులు సింగిల్ విండో సిబ్బందిని సంప్రదించాలన్నారు. రైతులకు సరిపడా ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

మున్సిపల్ కార్మికుల సమస్యలపై శనివారం మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేసినట్టు జిల్లా అధ్యక్షుడు రాజనర్స తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ పెండింగ్ డబ్బులు కార్మికుల అకౌంట్లో జమ చేయాలని, మున్సిపల్ కార్మికులకు కేటగిరి వారిగా జీవో నెం 60 ప్రకారం పెరిగిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

4, 5 తేదీల్లో మున్సిపల్ ముందు దీక్షలు..

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జనవరి 4,5 తేదీలలో 48 గంటల మున్సిపల్ కార్యాలయం ముందు దీక్షలు ఉంటాయని, అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే 6వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. జనవరి 27 తర్వాత మున్సిపల్ కార్మికుల పర్మినెంట్ కనీస వేతనాలు 26 రూపాయలు పరిష్కారం కాకపోతే సమ్మెకు పోతామని వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందిస్తూ చైర్పర్సన్ రెండు, మూడు రోజుల్లో మీ జీతాలు అందే విధంగా చూస్తామని, దాంతోపాటు పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల అకౌంట్లో జమ అయ్యేవిధంగా చేస్తామని స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహబూబ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్, కాత్రియాల ప్రభు, దీపక్, శివరాజవ్వ, గంగాధర్, జ్యోతి, రవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వేయింగ్ తూకం ప్రారంభించిన చైర్మన్



వేయింగ్ తూకంను ప్రారంభిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-మద్నూర్

రైతులకు సౌకర్యాలు ఏర్పర్చడంలో చైర్మన్ కృషి అభినందనీయమని వ్యవసాయ రైతులు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వేయింగ్ తూకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుప్పు పట్టిన మార్కెట్ కమిటీ ఆవరణంలో గల వేయింగ్ తూకం ఏళ్ల తరబడి పని చేయకుండా వదిలిపెట్టారని తెలిపారు. దానిని బాగు చేయించి వేయింగ్ తూకం ప్రారంభించడం రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వ్యవసాయ రంగానికి కావలసిన పనులను ముందుకు తీసుకు వెళ్లడం, రైతులకు మార్కెట్ పరంగా ఎలాంటి సౌకర్యాలైన అందించడానికి తక్షణ చర్యలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి రామ్నాథ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్‌లు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-జుక్కల్

జీపి కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తూ, రూ.18వేలు ఫిక్స్ వేతనం ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత జీపి కార్మికుల సమ్మెకు మద్దతుగా సిఐటియు, జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ పాల్గొనిమాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జీపి కార్మికులందరికీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని, ప్రతినెల 1న వేతనాలు నేరుగా కార్మికుల అకౌంట్లో పడాలని పేర్కొన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలు కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ తమ డిమాండ్ల పరిష్కారం అయ్యేంతవరకు ఐక్యంతో



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఉండి డిమాండ్లు సాధించుకోవాలని జీపి కార్మికులందరికీ ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.అజయ్ కుమార్, జీపి కార్మికుల మండల అధ్యక్షులు గోవింద్, మండల కార్యదర్శి వాగమరే సాయిలు, ఉపాధ్యక్షులు ఈరన్న, కార్మికులు ఈ.పండరి, నర్సింగ్, కే.దవులయ్య, యాదవు, సంజయ్, ఈ.దేవదాస్, మెత్రి గంగారాం, మండలంలోని వివిధ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల మహా పాదయాత్ర

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా 19వ రోజు శనివారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు ఐదు కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేసి వారు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం మోసం చేసి తమ జీవితాలను నాశనం చేశాయని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో నైనా తమను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

అమరవీరుల స్తూపం సాక్షిగా తమ డిమాండ్ పరిష్కారం అయ్యేవరకు సమ్మెను మరింత ఉధృతంగా కొనసాగిస్తామని, విద్య వ్యవస్థను స్తంభింప చేస్తామని అన్నారు. ఉద్యోగులు అమరవీరుల స్తూపం వద్ద ప్రతిజ్ఞ చేస్తూ తెలంగాణ సాధన పోరాటంలో చేసిన రీతిలోనే మా ఉద్యమ పంత నడుస్తుందని మా వెట్టి చాకిరి విముక్తి ఉంది వరకు మమ్మల్ని విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేసేవరకు మా పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంతరం నిజాంసాగర్ చౌరస్తాలో వున్న పోలీస్ కిష్టయ్యకు పూల మాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంపత్ మహిళా అధ్యక్షురాలు వాసంతి,నాయకులు శ్రీధర్ రాములు, శైలజ,సంతోష్ రెడ్డి వనజ,మంగా, శ్రీవాణి, కళ్యాణ్,సంధ్య,లింగం, కృష్ణ,దినేష్,వీణ, లావణ్య 500 మంది సభ్యులు పాదయాత్రలో పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల పాదయాత్రను ప్రారంభిస్తున్న పలువురు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సీతారాం ప్రసాద్ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాదులోని ఆసుపత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జాహిరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్, మహ్మద్ ఇలియాస్ ,రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దోమకొండ మండల కేంద్రంలోని ఆయన స్వగృహం వద్ద బాధిత కుటుంబన్ని పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకునే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, మండల అధ్యక్షుడు అనంత రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, నాయకులు ఆశ బోయిన శీను, స్వామి, ముత్యం రెడ్డి, సిద్ధా రెడ్డి, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని ఆడివిలింగాల గ్రామానికి చెందిన శివగారి గంగవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశానుసారం బాధిత కుటుంబాన్ని ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శనివారం పరామర్శించారు. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామం చెందిన కర్రోల లక్ష్మి ఆరోగ్యంతో మృతి చెందడంతో కుటుంబాన్ని పరామర్శించారు 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సామెల్, మాజీ సొసైటీ చైర్మన్ బొండ్ల సాయిలు, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్ రెడ్డి, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,ఆడివిలింగాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

ఆర్చరీ క్రీడలో జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని గడికోటలో రాష్ట్రస్థాయి అర్చరి క్రీడలలో సిల్వర్ మోడల్స్ సాధించిన ఇద్దరు క్రీడాకారులను జిల్లా ఆర్చరీ అధ్యక్షుడు తీగల తిరుమల గౌడ్, నాయకులు శనివారం అభినందించారు. ఈ సందర్భంగా అర్చరి కోచ్ ప్రతాప్ దాస్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అర్చరీ క్రీడా పోటిలలో ఇందు, అనుదీప్ లు సిల్వర్ మోడల్ సాధించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి, నాయకులు పున్న లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంక్షేమ పథకాలు లబ్దిదారులకు చేరుస్తున్నాం

- రైతులు, పేదల సంక్షేమమే లక్ష్యం
- కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పండ్లరాజు
- ఎన్ఎస్‌యూఐ నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్నానని ఏ పదవి అప్పగించినా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్దిదారులకు చేర్చేందుకు పార్టీ నాయకులుగా తాము పని చేస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పండ్లరాజు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటున్నామని తెలిపారు. ఎన్ఎస్‌యూఐ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీలో తన ప్రస్థానం ప్రారంభించి ఆది నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నట్టు తెలిపారు. పార్టీ అధికారం లో లేకున్నా.. ఇతర పార్టీల వైపు చూడలేదని, కాంగ్రెస్ ఇచ్చిన బాధ్యతలు నిర్వర్తించుకుంటూ వస్తున్నానని, భవిష్యత్తులో ఏ పదవి



సీఎం రేవంత్‌రెడ్డితో పండ్లరాజు

ఇచ్చినా నిర్వర్తిస్తానని తెలిపారు. నవతెలంగాణకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాగా ఉన్నప్పుడు ఉమ్మడి సదాశివనగర్ మండలం రామారెడ్డి గ్రామానికి చెందిన తాను.. విద్యార్థి దశ నుంచే రాజకీయాలంటే మక్కువతో ఎన్ఎస్‌యుఐలో చేరి ఉమ్మడి జిల్లాలో కామారెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించి, విద్యార్థుల కోసం ఎన్నో పోరాటాలు చేసినట్టు తెలిపారు. అనంతరం 2005లో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా, ఉమ్మడి జిల్లాలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా, అనంతరం ఎంఎస్‌యుఐ అధ్యక్షులుగా కొనసాగినట్టు తెలిపారు. తన సేవలను గుర్తించిన పార్టీ.. 2005లో అవకాశం కల్పించడంతో సదాశివనగర్ మండల ఎంపీపీగా కొనసాగినట్టు తెలిపారు. అనంతరం 2009 నుండి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కొనసాగారు. 2019 నుంచి పార్టీ కామారెడ్డి పట్టణ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నట్టు తెలిపారు.

అనేక పోరాటాలు..

ఎన్ఎస్‌యుఐలో కొనసాగుతున్న సమయంలో అప్పటి తెలుగుదేశం పార్టీ నల్లబెల్లాన్ని నిషేధించడంపై కామారెడ్డిలో రైతులతో కలిసి ఉద్యమం చేసినట్టు తెలిపారు. మాచారెడ్డి మండల రైతులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారికోసం ముందుండి పోరాడానని, రైతులు వేసిన పంటలు సరిగా పండక, వడగలవానకు నష్టపోవడం, విద్యుత్ సమస్య తదితర సమస్యలతో రైతులు పెట్టిన పెట్టబడులు రాక, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందక ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని పలుసార్లు మాచారెడ్డి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టినట్టు తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలో లేకున్నా.. ఏండ్లుగా పార్టీనే అట్టిపెట్టుకొని పని చేస్తున్నానని, ఇతర పార్టీల్లో అవకాశాలు వచ్చినా.. మారకుండా పార్టీ కోసం పని చేస్తూ వస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జిల్లాలో పార్టీ ప్రతిష్ఠకు పాటుపడుతున్నట్టు తెలిపారు. తన సేవలను షబ్బీర్‌అలీతో పాటు అధిష్టానం దృష్టిలో ఉన్నాయని, భవిష్యత్తులో ఏ ఇతర పదవి ఇచ్చిన నమ్మకంతో పని చేస్తానని వెల్లడించారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు జంగం గంగాధర్ మాట్లాడుతూ.. ఈ నెల 27, 28 టోకెన్ సమ్మె చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం ప్రకారం శనివారం టోకెన్ సమ్మెలో పాల్గొన్నట్టు తెలిపారు. 3 నుంచి 4 నెలల వరకు వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, అదేవిధంగా పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇల్లు లేని వారికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించి జనవరి మొదటి వారంలో సమ్మెలోనికి వెళ్లకుండా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించండి

- స్టేట్ టీచర్స్ యూనియన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తక్షణమే పెండింగ్ బిల్లులను చెల్లించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని వివిధ పాఠశాలలో 2025వ సంవత్సరానికి చెందిన క్యాలెండర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలో జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చాలా రోజుల నుంచి చెల్లించలేదని తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వచ్చిన 6 నెలల లోపు పెండింగ్ బిల్స్ క్లియర్ చేస్తామని, డిఎలు అన్నీ కూడా ఇస్తామని, పీఆర్సీ కూడా వీలైనంత తొందరగా ఇస్తామని చెప్పారన్నారు. కానీ సంవత్సరం పూర్తయినా వాటిని పరిష్కరించకపోవడం శోచనీయమని తెలిపారు. ఇప్పటికైనా వాటిని క్లియర్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి అఫ్జల్ బెగ్, స్టేట్ ఎయిడెడ్ కో కన్వీనర్ రవీందర్ గౌడ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

- విద్యార్థి సంఘం నాయకులు
- బీసీ విద్యార్థుల సమర శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. శనివారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఇందిరా పార్క్, హైదరాబాద్‌లో తలపెట్టిన బీసీ విద్యార్థుల సమర శంఖారావం పోస్టర్‌ను బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సిరివెసు సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారుగా 4,500 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఏ విధంగా అయితే స్కాలర్షిప్లు విడుదల చేస్తున్నారో బీసీ విద్యార్థులకు కూడా ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. బీసీ గురుకులకు, సంక్షేమ వసతి గృహాలలో సొంత భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలలో రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. పూలే ఓవర్సీస్ స్కాలర్షిప్ మంజూరు సంఖ్యను పెంచాలని కోరారు. హైదరాబాదులో 10 ఎకరాలలో పూలే నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రాష్ట్రంలో నుంచి అన్ని జిల్లాల బీసీ విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి బీసీ విద్యార్థుల సమర శంఖారావాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బుస్స ఆంజనేయులు, కరిపే రవీందర్, కొయ్యాడ శంకర్, దర్శనం దేవేందర్, చంద్రమోహన్, శ్రీలత, మురళి, బాలన్న, చంటి, మాధవ్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



బీసీ విద్యార్థుల సమర శంఖారావం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

స్వగ్రామం చేరిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం

నవతెలంగాణ-ముప్కాల్



ముత్తెన్న (ఫైల్)

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన బొప్పారం ముత్తెన్న (56) పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియా వెళ్లి అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే వేంపల్లికి చెందిన ముత్తెన్న కొన్ని సంవత్సరాలుగా సౌదీకి ఉపాధి నిమిత్తం వెళ్ళాడు. నవంబర్ నెలలో అనారోగ్యంతో అక్కడి అస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతున్నప్పటికీ అతని ఆరోగ్యం మెరుగు పడక పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతి చెందిన విషయం తెలుసుకున్న గల్ఫ్ కార్మికుల సంఘం అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడు, పోతుగంటి సాయెందర్ ప్రభుత్వం తరుపున ఉచిత అంబులెన్సు సౌకర్యం కల్పించారు. మృతదేహాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

ముప్కాల్ వాసికి అరుదైన గౌరవం

నవతెలంగాణ-ముప్కాల్



తెలంగాణ రాష్ట్ర కబడ్డీ సెలక్షన్స్ కమిటీలో ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన వాసి కె.గంగాధర్‌రెడ్డికి చోటు లభించింది. ప్రస్తుతం గంగాధర్‌రెడ్డి జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయనకు రాష్ట్రస్థాయిలో చోటు లభించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాఫ్ట్ బేస్‌బాల్ జాతీయ స్థాయిలో ఆర్‌బీవీఆర్ఆర్ విద్యార్థుల ద్వితీయ స్థానం



గెలుపొందిన ఆర్‌బీవీఆర్ఆర్ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

9వ సాఫ్ట్ బేస్‌బాల్ సబ్-జూనియర్స్ యూత్, గర్ల్స్, బాయ్స్ జాతీయ స్థాయి చాంఫియన్ షిప్ 2024-25 తెలంగాణ, సాఫ్ట్ బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల్ జిల్లాలోని బెల్లంపల్లిలో ఈనెల 24, 25, 26న సాఫ్ట్ బేస్‌బాల్ సబ్-జూనియర్స్ విభాగంలో క్రీడ పోటీలను నిర్వహించారు. ఈ క్రీడలకు ఆర్.బి.వి.ఆర్.ఆర్ పాఠశాల 9, 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు కేరళ రాష్ట్రంతో తలపడి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో మాధురి, రాజారాజేశ్వరి, ఉషశ్రీ, శ్రీనిత, వర్షిక, మనితేజ్, సంజయ్, స్నేహిల్, స్లోక్, జయంద్రవర్మ పాల్గొని విజయం సాధించారు. విజయం సాధించిన విద్యార్థులకు ఆర్.బి.వి.ఆర్.ఆర్ సొసైటీ అధ్యక్షులు జి.మహేందర్‌రెడ్డి, సెక్రటరీ ఎల్.గోవర్ధన్‌రెడ్డి, ఆలంబన కమిటీ చైర్మన్ రుక్మారెడ్డి, స్కూల్ చైర్మన్ పి.జగత్‌రెడ్డి, హాస్టల్ కమిటీ చైర్మన్ అమర్జిత్‌రెడ్డి, ఉమెన్స్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సువర్ణరెడ్డి, జాయింట్ సెక్రటరి ఎ.సుజిత్‌రెడ్డి, ట్రేజరర్ సాయరెడ్డి, ఎడ్యుకేషనల్ కమిటీ మెంబర్ ఉమామహేశ్వరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, అడిషనల్ హెడ్మాస్టర్, పి.ఈ.టిలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల్లో పలువురు ఆత్మీయులు వారి కుటుంబ సభ్యులను కోల్పోవడంతో వారిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. బషీరాబాద్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ తీవ్ర అనారోగ్యానికి గురై బాధపడుతుండటంతో వారిని పరామర్శించారు. చౌట్‌పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు నందు వాళ్ళ నాణమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమీర్‌నగర్ గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల రాజా గంగారాం, పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ జెడ్పిటిసి దాసరి భాస్కర్ యాదవ్, చిన్నాన్న దాసరి చిన్న బాలయ్య, పెదనాన్న దాసరి పెద్ద గంగారాం ఇద్దరు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోనాసముందర్ గ్రామానికి చెందిన బలేరావు సంతోష్ వాళ్ళ తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన పార్టీ నాయకులు సుంకరి మురళి తల్లి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక సాక్షి రిపోర్టర్ శంకర్ వాళ్ళ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శంకర్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి సీఎం నెట్‌బాల్ టోర్నమెంట్‌కు బాద్గుణ పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 21న నాగారం స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీలలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇందులో భాగంగా నందిపేట్ మండలం జడ్పిహెచ్ఎస్ బాద్గుణకు చెందిన విద్యార్థి కె.వర్ష ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.భోజన్న తెలిపారు. నెట్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ పోటీలను మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 31.12.2024 నుంచి 02.01.2025 వరకు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల పిడి దామెర సునీల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అదుపుతప్పి లారీ బోల్తా

నవతెలంగాణ-పోతంగల్



మండలం లోని కల్లూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి అదుపుతప్పి లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి మాగి షుగర్ ఫ్యాక్టరీ వరకు చెరుకు లోడుతో వెళ్తున్న లారీ కల్లూర్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని, బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలంపాట

నవతెలంగాణ-ఆర్మూర్

వివిధ కేసులలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్టు పట్టణ ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ శనివారం తెలిపారు.

అర్ధరాత్రి వరకు అనుమతా..?

- 31వ తేదీ నాడు వైన్స్‌షాపుల విక్రయ వేళల పొడిగింపుపై మండిపడుతున్న ప్రజలు
- గత ప్రభుత్వ ధోరణినే అవలంబిస్తోన్న సర్కార్

నవతెలంగాణ-మోపాల్

కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమూ వ్యవహరిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా కేవలం ప్రభుత్వానికి ఆదాయమే ముఖ్యమన్న రీతిలో నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 31న రాష్ట్రంలో మద్యం విక్రయ వేళలను పొడిగించింది ప్రభుత్వం. 31న అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయాలు జరుపుకునేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని అన్ని బార్ అండ్ రెస్టారెంట్లు, ఈవెంట్లో, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హోటళ్లలో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం అమ్మవచ్చు. అదేవిధంగా అన్ని వైన్ షాపులను ఆరోజు రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచవచ్చునని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.



కానీ ఎంతోమంది యువత ఆరోజు మద్యం అతిగా సేవించి బైక్‌లపై ప్రయాణిస్తుంటారు. తాగిన మత్తులో గందరగోళం సృష్టిస్తారు. రోడ్డు ప్రమాదాలు సైతం జరిగే అవకాశం ఎక్కువగానే ఉంది. ఇప్పటికే మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై జిల్లాలో ఎంతోమంది బతుకులు వీధిపాలయ్యాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి వైన్స్‌ల సమయాన్ని కుదించాలని ప్రజలు కోరుతున్నారు.

జనవరి 4 నుంచి జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ, నిజామాబాద్ డివిజన్ (నిజామాబాద్, కామారెడ్డి) ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు క్విజ్ పోటీలు జనవరి 4 (శనివారం) ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ కమీషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సోమిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు వారి పాఠశాల/కళాశాల నుంచి పాల్గొనవచ్చునని తెలిపారు. ఒక పాఠశాల/కళాశాల నుంచి (5)జట్లకు అవకాశం ఉందని, ఒక జట్టులో ఇద్దరు విద్యార్థులుండాలని సూచించారు. నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగం, మాదక ద్రవ్యాల వలన నష్టం అనే అంశం మీద క్విజ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్విజ్ తెలుగు, ఆంగ్లం భాషలో ఉంటుందని పేర్కొన్నారు క్విజ్ రెండు దశలలో ఉంటుందని, మొదట (25) మార్కులకు రాత పరీక్ష నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన (6) పాఠశాల జట్లను ఎంపిక చేస్తారని, రెండవ దశకు ఎంపికైన (6) జట్లకు రెండవ దశలో స్టేజి మీద దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా ప్రాజెక్టర్ సహాయంతో ఫైనల్ క్విజ్ నిర్వహిస్తారని వివరించారు. ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రతిభ చూపి రెండవ దశకు ఎంపిక కాని మొదటి (10) జట్లకు ప్రత్యేకంగా బహుమతులు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ధృవీకరణ పత్రం ఇస్తామని, స్టేజి రౌండులో విజేతలకు డిజిటల్ ట్యాబ్‌లు, డిజిటల్ గడియారాలు, పుస్తకాలు, ధృవీకరణ పత్రాలు జ్ఞాపకలను బహుమతులుగా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9966440700 (నిజామాబాద్)/ 93946 80680 (కామారెడ్డి) నెంబరుకు ఫోన్‌చేసి జనవరి 2వ తేది వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని తెలిపారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ నిజామాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

సర్వేలో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలి

- సూపర్‌వైజర్, ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్
- ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సర్వేలో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి సూపర్‌వైజర్, ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్ సూచించారు. శనివారం మండలంలోని కోనసముందర్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ లబ్దిదారుల సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామంలో 824 మంది ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద దరఖాస్తు చేసుకోగా నేటికీ 500ల మంది లబ్దిదారుల వివరాల పరిశీలన పూర్తయిందని, మరో 300 మంది లబ్దిదారుల వివరాలు పరిశీలించాల్సి ఉందన్నారు. వీటిని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని, ఇందుకు వీలైతే మరో సర్వే బృందాన్ని అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిసి వర్దం శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది, వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద కిక్కిరిసిన జనం

నవతెలంగాణ-మోపాల్

గత మూడు రోజులు సెలవు దినాలు కావడంతో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లు, ఇతర సమస్యలపై ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి శనివారం భారీ ఎత్తున వచ్చారు. దీంతో ప్రజలతో అక్కడి ప్రాంగణం కిక్కిరిసిపోయింది.



తహసీల్దార్ కార్యాలయం ముందు నిలిపిఉంచిన బైక్‌లు

జాతీయ కరాటే చాంఫియన్‌లో సిల్వర్, రజత పతకాలు

నవతెలంగాణ-మెండోరా

ముంబైలో జాతీయస్థాయి కరాటే చాంఫియన్ షిప్ పోటీలలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు సిల్వర్, రజత పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్ పాషా తెలిపారు. 27, 28 తేదీ ముంబైలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ వెల్గటూర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కటాస్ కుంతే ఫైటింగ్ విభాగంలో జి.శ్రీనాథ్ సిల్వర్ పతకం సాధించగా ఎన్.జశ్వంత్ రజత పతకం గెలుచుకున్నాడు. సిల్వర్, రజత పతకాలు సాధించిన శ్రీనాథ్, జశ్వంత్‌కు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేసి ఛాంపియన్ షిప్ ట్రోఫీని



అందజేశారు. జాతీయస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ వెల్గటూర్ కరస్పాండెంట్ అజ్మత్ పాషా, ఉపాధ్యాయ బృందం వారిని అభినందించారు. మారుమూల గ్రామంలో సైతం విద్యార్థులకు అన్ని రంగాలలో ప్రోత్సాహన్ని అందిస్తూ అన్ని రకాలుగా విద్యార్థులను ముందుకు తీసుకు వెళుతూ మండల, జిల్లాస్థాయిలో మాత్రమే కాకుండా జాతీయస్థాయి కరాటే పోటీల్లో కూడా విజయం సాధించి ప్రతిభ కనబరిచేలా విద్యార్థులకు మెలకువలు నేర్పుతూ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి కీర్తిని తెచ్చిపెట్టేలా కృషిచేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ అజ్మత్ పాషాకు ఉపాధ్యాయులు అవినాష్, శివానిలకు పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందించారు. ముమ్ముందు విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు.

సెల్‌ఫోన్‌లు రికవరీ

- బాధితులకు అప్పగింత

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని 4వ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధిత యజమానులకు అప్పగించినట్టు ఎస్ఐ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారి ఫోన్స్‌ని సిఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి 6 ఫోల్‌ఫోన్‌లను యజమానులకు అందజేసినట్టు తెలిపారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో నగరంలోని రాజరాజేంద్ర చౌరస్తా, వర్ని రోడ్డులలో ఉన్న హనుమాన్ మందిరాల వద్ద యాచకులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షులు అబ్బాయి లింబాద్రి మాట్లాడుతూ.. చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి కరిపె రవీందర్, కార్యదర్శి చెన్న రవీందర్, కోశాధికారి పి.రాఘవేందర్, పూర్వాధ్యక్షులు చింతల గంగాదాస్, ఇరుమల శివలింగం, ప్రోగ్రాం చైర్మెన్ అంకం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలను అరికట్టాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, పోలీసులు వాటిని అరికట్టాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరెపల్లి సాయిలు డిమాండ్ చేశారు. శనివారం ఏసీపీ వెంకటేశ్వర్రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ కేంద్రంలోనే కాకుండా మండలాల నుంచి పల్లెల్లో కూడా గంజాయి విక్రయాలు జోరుగా కొనసాగుతున్న వాటిని అరికట్టాలని తెలిపారు. యువత, విద్యార్థులు, గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ.. యువత చెడు మార్గంలో వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తక్షణమే గంజాయిని అరికట్టేందుకు పోలీసులు భద్రత పెంచాలని ఏసీపీని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమా శ్రీను, మాదరి నరేష్, దుర్గం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ రాక

నవతెలంగాణ-మోపాల్

మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు నిజామాబాద్ నగరానికి వస్తున్నారని మోపాల్ మండల మాజీ జెడ్పిటిసి కమలా నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా రోజుల తర్వాత జిల్లాకు రానున్న సందర్భంగా డిచ్‌పల్లి వద్ద బీఆర్ఎస్ మోపాల్, ఇతర రూరల్ మండలాల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని బైపాస్ రోడ్డు నుంచి సుభాష్‌నగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఎస్ సర్కిల్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి కవిత పుష్పాంజలి ఘటిస్తారని, అక్కడే ప్రజలను ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాధితులు, చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం, పప్పు, నూనె, పాలు, కోడిగుడ్లను పరిశీలించారు. కేంద్రానికి విచ్చేసిన చిన్నారుల కోసం వండి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాధితులకు ప్రభుత్వం నాణ్యమైన పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తుందని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాలకు విచ్చేసే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | డిసెంబర్ 29, 2024 | www.navatelangana.com

నిశిత డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిశిత డిగ్రీ కళాశాల (అటానమస్)లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రమశిక్షణతో ఉండటం, ఉన్నత స్థాయిని ఎలా చేరుకోవాలోనని పిల్లలకు అర్థమయ్యేలా విద్యాసంస్థ యాజమాన్యం వివరించింది. ఈ కార్యక్రమంలో నిశిత కళాశాల చైర్మన్ సి.నిఖిల్, చీఫ్ ప్యాట్రన్ సి.వినయకుమార్, డైరెక్టర్ డాక్టర్ ఓ.ఎం.శేఖ్, కో ఆర్డినేటర్ రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న, విభాగాధిపతి జి.అనిల్ కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని వి కన్వెన్షన్ హాల్‌లో ముప్కాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజన్న కుమారుడు శ్రీకాంత్ వివాహ వేడుకలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, మాజీ ఎంపీపీ నాగభూషణం, వెంకట్‌రెడ్డి, నాగంపేట్ శేఖర్, నర్సారెడ్డి, ఇఫ్తేఖరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

సమ్మెలో ఉద్యోగులు.. ఇంటికి విద్యార్థులు..

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం సమ్మె 22వ రోజుకు చేరుకుంది. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సైతం సమ్మెలో పాల్గొనడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడింది. దీంతో విద్యార్థులు బ్యాగులు సర్దుకుని ఇంటిబాట పడుతున్నారు.

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో వెలవెలబోతున్న కేజీబీవీలు
- పాఠశాలను వీడుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్/రెంజల్

బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలోని కేజీబీవీ విద్యార్థులు శనివారం బ్యాగులు సర్దుకుని ఇంటిబాట పట్టారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సైతం సమ్మెలో పాల్గొనడంతో పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడింది. దాంతో విద్యార్థుల గత 20 రోజులకుపైగా విద్యాబోధన లేక టీచర్లు లేక ఖాళీగా ఉంటున్నారు. ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోవడం వలన సమ్మె నిరంతరంగా కొనసాగిస్తున్నారు. ఉద్యోగుల సమస్యలు ఎటు పరిష్కారం కాకపోవడంతో శనివారం కొంతమంది తల్లిదండ్రులు కేజీబీవీ పాఠశాలకు చేరుకుని వారి పిల్లలను వెంట తీసుకెళ్లిపోయారు. ఎంఈఓ నాగయ్య మాత్రమే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం, సాయంత్రం పాఠశాలను, అక్కడి విద్యార్థుల ఆలనాపాలనా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలని లేని ఎడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగులు పేర్కొంటున్నారు.



బోధన్ : బ్యాగులతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



రెంజల్ : ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులే చదువుకుంటున్న దృశ్యం

రెంజల్ : సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గత మూడు వారాలుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న సమ్మెతో విద్యార్థులలో విద్యాబోధన కుంటుపడుతోంది. రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో గత మూడు వారాలుగా సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సిబ్బంది వంతుల వారీగా విద్యార్థులను కాపాడుకుంటూనే మరోవైపున సమ్మెలో వారు పాల్గొంటున్నారు. జిల్లా అధికారులు ఈ పాఠశాలలకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ రెంజల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఎలాంటి ప్రత్యేక అధికారులు రాకపోవడంతో సిబ్బంది వంతుల వారీగా విద్యార్థులకు భోజనాన్ని అందిస్తూ వారి బాగోగులను చూసుకుంటున్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది సైతం సమ్మెలో పాల్గొనాలని పిలుపు రావడంతో విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది.

బోధించిన పాఠాలే చదువుతున్నాం

రెంజల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినులు డి.వైష్ణవి, ఎస్.వేదిక మాట్లాడుతూ.. మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు తాము సిద్ధమవుతున్న ఈ తరుణంలో ఉపాధ్యాయులు సమ్మెలో పాల్గొనడంతో, గత మూడు వారాలుగా వారు బోధించిన పాఠాలను చదువుతున్నామని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు మహిశ్రీ, గీతాంజలి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తే తమకు విద్యను బోధించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి ప్రతిరోజు పాఠశాలను సందర్శించి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని, నాన్ టీచింగ్ సిబ్బంది సైతం సమ్మెలో పాల్గొంటే తమకు భోజనాన్ని అందించే వారే కరువవుతారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను సత్వరమే పరిష్కారమయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

సీఎం కప్ సెపక్ తక్రా రాష్ట్ర టోర్నీలో మహిళల జట్టుకు మూడో స్థానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హన్మకొండలోని డిఎస్ఏ మైదానంలో జరిగిన సిఎం కప్ సెపక్ తక్రా టోర్నమెంట్‌లో జిల్లా మహిళల జట్టు మూడవ స్థానం సాధించిందని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఆదేశాల మేరకు జిల్లా సెపక్ తక్రా ప్రధాన కార్యాదర్శి గాదారి సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఈ టోర్నమెంట్‌లో పదమూడు జట్లు పాల్గొనగా నిజామాబాద్ మూడవ స్థానం గెలుపొందిందని, ఈ క్రీడలలో రిక్కీ రెడ్డి, లక్కీ రెడ్డి మంచి ప్రతిభను కనబర్చారని పేర్కొన్నారు. జట్టు కోచ్, మేనేజర్‌లుగా చామ కూర భాగరెడ్డి, సంజీవరెడ్డి నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని దోంచంద గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి నవ్యకు రూ.60 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కురూపంలో రాగా, దోంచంద కాంగ్రెస్ నాయకులు ఆమెకు చెక్కును అందజేశారు. అలాగే ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన రాజారాం వసంతకు రూ.21 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రాగా, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషిచేసిన తెలంగాణ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డికి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్దిరెడ్డి రవి, నాయకులు దండేవోయిన సాయికుమార్, మెరుగు సురేష్, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, ఆశిరెడ్డి నరేష్, ప్రకాష్, ముత్తెయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పదవి విరమణ పొందుతున్న ఏఎంసీ కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రామ్నాథ్ ఈనెల 31తో ఆయన పదవీ విరమణ పొందనున్నారు. ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వహించే రామ్నాథ్ బోధన్ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా రామ్నాథ్‌ను మద్నూర్ సింగిల్‌విండో చైర్మన్ ఏఎంసి డైరెక్టర్ శ్రీనివాస్ పటేల్ శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సౌజన్య, రమేష్, పలువురు డైరెక్టర్లు, పాల్గొన్నారు. కాగా రామ్‌నాథ్.. మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య రమేష్ దంపతులకు శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు బి ప్లస్ ప్లస్ న్యాక్ గుర్తింపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలో గత 32 సంవత్సరాలుగా డిగ్రీ విద్యార్థులకు విద్యాబోధనలో ప్రత్యేక గుర్తింపు ఉన్న ఎస్ఎస్ఆర్ డీగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు పొందిందని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం ఒక్క ఎస్ఎస్ఆర్ డీగ్రీ కళాశాలకు మాత్రమే న్యాక్ అక్రిడేటేడ్ బి ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను సాధించిందని ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ యం.మారయ్య గౌడ్ తెలిపారు. ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. న్యాక్ నుంచి ఎస్-ఎస్ఆర్ కళాశాలకు న్యాక్ గుర్తింపు గ్రేడ్ బి ప్లస్ ప్లస్ దక్కించుకుందని, ఆన్లైన్ లో మేయిల్ వచ్చినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ గ్రామానికి చెందిన కూరబోయిన రాజమణి (57) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. కడుపునొప్పి భరించలేక గుర్తుతెలియని పురుగుల మందు తాగినట్లు తెలిపారు. వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్టు తెలిపారు. భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సిద్ధిరామేశ్వర్‌నగర్‌లో ఓ ఇంట్లో దొంగతనం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వర్‌నగర్ గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగల కొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. దొంగతనం జరిగిన రోజున ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శుక్రవారం రాత్రి వచ్చి చూసేసరికి ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ జగదీష్ శనివారం ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి ఘటన స్థలం వద్ద క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిద్ధిరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్ర శివారులోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధిరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన కట్న కానుకలను లెక్కించగా 3 లక్షల 37 వేల 127 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి పద్మ శ్రీధర్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీరామ్ రవీందర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అందే మహేందర్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



సీఎం రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఈనెల 31 నుండి వచ్చే నెల రెండవ తేదీ వరకు నిర్వహించనున్న సీఎం కప్ పోటీలకు నాగిరెడ్డిపేట నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సభాత్ కృష్ణ తెలిపారు. మండలంలోని గోపాల్పేట్ లో గల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని అర్చన విద్యార్థి అభిలాష్ నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఉపాధ్యాయ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-తాద్వాయి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆంగ్లం బోధించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్చార్జి ప్రిన్సిపల్ సిహెచ్, శిరీష శనివారం ఒక ప్రకటనలు పేర్కొన్నారు. టీజీటీ, ఆంగ్లం బోధించేందు కోసం బీఈడీ, పీజీ, చేసిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్ ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను మండల ప్రత్యేక అధికారి స్రవంతి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో సైతం సర్వే పనులను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్ ఆనంద్, పంచాయితీ సెక్రటరీ మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

సమగ్ర శిక్ష ఉద్యోగుల భిక్షాటన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 22వ రోజు సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నిజామాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా సిగ్నల్స్ వద్ద నుంచి కోర్టు చౌరస్తా వరకు ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన వీధులలో, షాపులలో పాదాచారులకు బిక్షం అడిగి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మెను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే రాజు, భూపేందర్‌లు పేర్కొన్నారు. లేదా 15, 20 సంవత్సరాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు అతి తక్కువ వేతనాలతో క్రమశిక్షణతో పనిచేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని రానున్న రోజుల్లో తమ ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, సుప్రజ, రాజు, విద్యాసాగర్, పవిత్రన్, అప్సర్, సంతోష్, గిరీష్, రమేష్, మోహన్, జలంధర్, రాజమణి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

గుర్తింపు లేని సంఘంతో క్రీడల నిర్వహణ

- జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.మనోజ్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తైక్వాండో అసోసియేషన్ నిజామాబాద్ అనే పేరుతో, ఈనెల 29న ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించే జిల్లాస్థాయి టోర్నమెంట్‌కు నిజామాబాద్ తైక్వాండో అసోసియేషన్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్, డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ నుంచి ఎలాంటి గుర్తింపు లేదని, కొందరు పొట్ట గడుపుకోవడానికి బోగస్ సంఘాల పేరుతో సంఘాలు ఏర్పాటు చేస్తున్నారని, ఆ సంఘాలు ఇచ్చిన సర్టిఫికెట్లు దేనికీ ఉపయోగపడవని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.మనోజ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్యకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్‌లో ఎంట్రీ ఫీ రూ.1500 పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇది కేవలం పొట్ట గడుపుకోవడానికి సంఘాలను ఏర్పాటు చేసి క్రీడాకారులకు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘాలను ప్రోత్సహిస్తే దేనికి ఉపయోగం ఉండదని అన్నారు. గుర్తింపు లేని క్రీడ సంఘాలు క్రీడలు నిర్వహిస్తే అటువంటి క్రీడాల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, అలాంటి సంఘాలకు త్వరలో బుద్ధి చెప్తామని అన్నారు. గుర్తింపు పొందిన సంఘాలు క్రీడాపోటీలను ఏర్పాటు చేసినప్పుడే తల్లిదండ్రులు క్రీడా పోటీలకు పంపాలని కోరారు. జిల్లా క్రీడా సంఘానికి, రాష్ట్ర క్రీడా శతకం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా ఒలంపిక్ సంఘం గుర్తింపు ఇచ్చినప్పుడే క్రీడ సంఘానికి గుర్తింపు ఉంటుందని వివరించారు.

మహనీయుల చరిత్రలు సదా స్ఫూర్తిదాయకం

- పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళి, సంతాపం, శ్రద్ధాంజలి

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : మహనీయుల చరిత్రలు సదా స్ఫూర్తిదాయకమని, అటువంటివారిలో పూర్వ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ఒకరిని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం లోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో ప్రార్థన సమయంలో భారత పూర్వ ప్రధానమంత్రి స్వర్గీయ మన్మోహన్ సింగ్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగాకిషోర్ మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ భారత ప్రధానిగా అమూల్యమైన సేవలను అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జే.గణేశ్, రాజు, నరహరి, రాము, దత్తాత్రేయ, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి(లింగంపేట్) : ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాలలో శనివారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ లక్ష్మి నారాయణ మరియు కళాశాల అధ్యాపక మరియు అధ్యాపకేతార బృందం కలిసి జాతీయ సేవ సమితి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధంజలి తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ లక్ష్మి నారాయణ, అధ్యాపక బృందం కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ శివ కుమార్, నాగనీక, తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అమరేషం ప్రభాకర్ రావు, అధ్యాపక బృందం డాక్టర్ గంగారెడ్డి, డాక్టర్ సిద్దు రాజు, కృష్ణ ప్రసాద్, శశిధర్, చంద్ర కాంత్, సంతోష్, రాణి, సంగీత, స్వప్న, మొయిన్, మైమూద్, దశరథ్, సురేష్‌రెడ్డి అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : కామారెడ్డి జిల్లా సదాశినగరం మండల సమాఖ్య సమావేశంలో శనివారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నివాళులు అర్పించారు. ఈ సమావేశానికి శోభ అధ్యక్షతన రెండు నిమిషాల మౌనం పాటించారు. అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు మండల సిబ్బంది డీఎంజి రాము, సీసీ తదితరులు పాల్గొన్నారు.

తాద్వాయి : ఉపాధి హామీ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు నిమిషాలు మౌనం పాటించి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానిగా ఉండి ఉపాధి హామీ పథకంతో పేదలకు పనులు కల్పించి ఆదుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు రాజేష్, మహిపాల్, స్వామి రామకృష్ణ సందీప్, రాజ్ కుమార్, లింగం, సందీప్‌గౌడ్, తదితరులున్నారు.



మద్నూర్‌లో..



సదాశివనగర్‌లో..



తాద్వాయిలో..